
జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ మల్లారెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు

ఫార్మా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

● కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ మల్లారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఫార్మారంగ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉన్నదని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లి గ్రామంలోని అవంతి కళాశాలలో 'బయో అధ్యాయన్' పేరుతో రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ఫార్మా విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. ఫార్మారంగ విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడి తల్లిదండ్రుల కళలను సాకారం చేయాలన్నారు. అదే విధంగా కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రెటరీ ప్రియాంక, డాక్టర్ రామకిషన్, రామలింగేశ్వరరావు, రాజగోపాల్‌శర్మ, డాక్టర్ బలరాం, ప్రిన్సిపాల్ బాలాజీతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.


అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

అక్రమ నిర్మాణం కూల్చివేత

మన్సూరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ రాక్‌టౌన్‌కాలనీలో ఓ భవన నిర్మాణంలో అక్రమంగా నిర్మిస్తున్న అంతస్తులను జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం కూల్చివేశారు. ఆ భవనానికి రెండు అంతస్తుల వరకు మాత్రమే అనుమతులుండగా అదనంగా మరో రెండంతస్తుల చొప్పున నాలుగు అంతస్తులను అక్రమంగా నిర్మించారు. విషయం తెలుసుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు టీపీఎస్ అక్బర్ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు.


రాకపోకలకు ఇబ్బందిగా ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

అడ్డుగా ఉన్న సిమెంటు దిమ్మెలను తొలగించండి

● జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సైకిల్ ట్రాక్ అంటూ విజయవాడ జాతీయ రహదారిపై కాలనీల్లోకి వెళ్లకుండా అడ్డుగా వేసిన సిమెంటు దిమ్మెలతో ప్రజలు రాకపోకలు సాగించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటిని తొలగించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సరైన పార్కింగ్ కల్పించకుండా అడ్డదిడ్డంగా అక్రమ పార్కింగ్‌లకు నిలయాలుగా మారిన వ్యాపార సముదాయాలపై ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పలు కాలనీల్లో ఏళ్లనాటి భూగర్భ డ్రైనేజీ లైన్లతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తొందరలోనే పునర్నిమించుకుందామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌యాదవ్, రవి, హరీశ్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాదళ్ నూతన కమిటీ సభ్యులు

సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాదళ్ కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాదళ్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన గౌరవ అధ్యక్షులుగా బోడ గన్నానాయక్, ఇస్లావత్ చందునాయక్, అధ్యక్షుడిగా పాతులోతు రామకోటినాయక్, ఉపాధ్యక్షులుగా నేనావత్ సూర్యానాయక్, కేతావత్ అమర్సన్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నేనావత్ రవికుమార్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా రాత్లావత్ భరత్‌లాల్‌నాయక్, కోశాధికారిగా భుక్య రామానాయక్, సహాయ కార్యదర్శిగా రమావత్ రవినాయక్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కరంటోత్ రమేష్‌నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ నియామకానికి కృషిచేసిన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్‌కు ఇతర కమిటీ సభ్యులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

స్వర్ణగిరి దేవాలయానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చాదర్‌ఘాట్ : యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ క్షేత్రంగా విలసిల్లుతున్న స్వర్ణగిరి దేవాలయానికి ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ సమత తెలిపారు. ప్రతి శనివారం, ఆదివారాల్లో స్వర్ణగిరి దేవాలయానికి మెట్రో డీలక్స్ బస్సులను నడపనున్నట్లు ఆమె తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఉదయం 8గంటలకు బస్సులు ప్రారంభమై ఎల్బీనగర్, ఉప్పల్‌చౌరస్తా, ఘట్‌కేసర్ మీదుగా భువనగిరిలోని స్వర్ణగిరి దేవాలయానికి చేరుకుంటుందన్నారు. తిరిగి సాయంత్రం 6గంటలకు స్వర్ణగిరి దేవాలయం నుంచి ప్రారంభమవుతాయని ఆమె వివరించారు. ప్రతి 1.40గంటలకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సదావకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ విజ్ఞప్తి చేశారు.


బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-3లో నిర్మించిన సీసీ రోడ్డు పనులు పూర్తైన నేపథ్యంలో పేరుకపోయిన మట్టికుప్పల తొలగింపు చర్యలు చేపడుతున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి. - వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

వేసవిలో విద్యుత్ అంతరాయాలకు అడ్డుకట్ట!

రారెత్తిస్తున్న ఎండలతో పెరిగిన వినియోగం ● ముందస్తు చర్యలు చేపట్టిన అధికారులు

సైదాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వేసవి సీజన్ ప్రారంభమవడంతో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుపోతుంది. దీంతో పెరుగుతున్న అధిక విద్యుత్ లోడ్‌ను తట్టుకునేందుకు ఆస్మాన్‌ఘడ్ డివిజన్(సిటీ-8) విద్యుత్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. సాధారణంగా ఇతర రోజుల కంటే వేసవిలో దాదాపు రెట్టింపు విద్యుత్ వినియోగం అవుతుంది. దీంతో విద్యుత్ సరఫరాలో సమస్యలు అధిగమించేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వారం రోజులుగా ఎండలు ప్రారంభం కావడంతో అధిక విద్యుత్ లోడ్‌ను తట్టుకునేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న అంతరాయాలను తగ్గించేందుకు కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి తెస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో 11కేవీ, ఎల్‌టీలైన్లు మార్చడం, విద్యుత్ స్తంభాలను తొలగించడం, విద్యుత్ తీగల వద్ద అంతరాయం కలిగించే చెట్లను తొలగించే పనులు చేపడుతున్నారు. ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్ పరిధిలో ఆస్మాన్‌ఘడ్, చంచల్‌గూడ, సంతోష్‌నగర్ సబ్ డివిజన్‌లు ఉండగా మొత్తం సుమారు రెండు లక్షలకు పైగా వినియోగదారులుండగా డొమెస్టిక్ కనెక్షన్లు 1,90,041 ఉన్నాయి. ఆస్మాన్‌ఘడ్, చంచల్‌గూడ, సైదాబాద్, చాదర్‌ఘాట్, సలీంనగర్, సంతోష్‌నగర్, డబీర్‌పురా, యాఖత్‌పురా, భవానీనగర్, మాదన్నపేట 11సెక్షన్ల పరిధిలో 33/11కేవీ, చంచల్‌గూడలో మరో 220/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిలో సుమారు 122 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్‌లో 61,982, సంతోష్‌నగర్‌లో 67,167, చంచల్‌గూడ సబ్ డివిజన్‌లో 60,894 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.


చంచల్‌గూడ సబ్‌స్టేషన్

నిరంతర విద్యుత్ సరఫరా


ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో వేసవి కార్యాచరణ ప్రణాళికలను సమర్థంగా అమలు చేస్తున్నాం. వేసవిలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఒక వేళ అంతరాయాలు ఏర్పడిన వెంటనే పునరుద్ధరించడానికి చర్యలు చేపడుతాం.

- విష్ణువర్ధన్‌రెడ్డి, డీఈ, ఆస్మాన్‌ఘడ్ డివిజన్


ఆస్మాన్‌ఘడ్ డివిజన్ విద్యుత్ కార్యాలయం

చేపట్టిన నిర్వహణ పనులివి..

- అధిక విద్యుత్ వినియోగంతో సబ్‌స్టేషన్లు, ఫీడర్లపై అధిక లోడ్ పెరిగినా, సరఫరాలో అంతరాయం కలుగకుండా నిర్వహణ పనులను చేపట్టారు.
- అనుకోని పరిస్థితుల్లో సబ్‌స్టేషన్‌లో షట్‌డౌన్ అయితే మరో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు.
- ఒక ఫీడర్ ట్రిప్ అయితే మరో ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేశారు.
- జంపర్లు, లైన్లు, డీటీఆర్ ఏబీ స్విచ్‌ల మరమ్మతులతో పాటు అవసరమైన చోట కొత్త వాటిని అమర్చారు.
- అధిక విద్యుత్‌ను తట్టుకునే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీని పెంచుతున్నారు.
- లోడ్‌ను తగ్గించడానికి అదనపు సర్క్యూట్లను వేస్తున్నారు.


ఏబీ స్విచ్ మరమ్మతు పనుల్లో సిబ్బంది

జాతీయ సాంకేతిక ఉత్సవం, జిజ్ఞాస-2025 ప్రారంభం

సైదాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ వినయ్‌నగర్‌లోని భోజిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవం, జిజ్ఞాస-2025ను గురువారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, జెఎన్‌టీయూహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. శ్రీదేవి ప్రారంభించారు. ప్రొఫెసర్ శ్రీరాంవెంకటేష్ మాట్లాడుతూ సాంకేతిక ఉత్సవాలు విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సృజనాత్మక, క్లిష్ట పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు మరింత జ్ఞానాన్ని పొందేందుకు వీలు కల్పిస్తాయని అన్నారు. ప్రొఫెసర్ శ్రీదేవి మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి జాతీయ సదస్సులు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ ఉత్సవాలలో ఏపీ, తమిళనాడు, గుజరాత్, భోపాల్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 630మంది ఔత్సాహిక విద్యార్థులు హాజరయ్యారు. ప్రదర్శనలో అత్యాధునిక ప్రాజెక్టులు, ప్రోటోటైపన్లు ఆవిష్కరించారు. ఇన్నోటెక్ వంటి ఈవెంట్లతో విద్యార్థులు సందడి చేశారు. మైండ్‌మేనేజ్ మెంట్ లాంటి చాలెంజ్ టెస్టింగ్, ప్రాబ్లమ్- సాల్వింగ్ సామర్థ్యం, పోస్టర్ ప్రదర్శన ద్వారా సామర్థ్యాన్ని కనబరిచారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ వి.సుధ, సీఈఓ డాక్టర్ సుజాత, అడకమిక్ డైరెక్టర్ డాక్టర్ గ్రేపి, శైలశ్రీ, కన్వీనర్లు దీప్తి, మంజుభార్గవి, డిప్యూటీ హెచ్‌ఎం దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సావనీర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యమండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, జెఎన్‌టీయూహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీదేవి



హస్తినాపురం నారాయణ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను నిర్వహించారు. విద్యార్థులు తమ పాఠశాల జీవితానికి వీడ్కోలు పలుకుతూ, ఆశ, ధృఢ సంకల్పంతో వారి విద్యా ప్రయాణంలో తదుపరి దశలోకి అడుగుపెడుతున్నారని ప్రిన్సిపాల్ లక్ష్మీశారద అన్నారు. కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమాంబ, ఆర్ అండ్ డి శివరంజని, మహేశ్వరి, మీన, కోఆర్డినేటర్లు శరత్‌బాబు, గాయత్రి, శిరీష, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. - వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి


పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన మల్కా కొమురయ్యను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి.
- వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

మూసీ రివర్‌బెడ్‌లో కొనసాగుతున్న పనులు

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : మూసీ రివర్‌బెడ్‌లో ఇళ్ల కూల్చివేతలు పూర్తయ్యాయి. రివర్‌బెడ్‌లో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించడంతో ఖాళీచేసి వెళ్లిపోయారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ శంకర్‌నగర్, వాహెద్‌నగర్‌లలో రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వారు గుర్తించిన ఇళ్లన్నీ యంత్రాలతో పూర్తిగా నేలమట్టం చేశారు. మూసీరివర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో రివర్‌బెడ్ వెంట పనులు చురుకుగా సాగుతున్నాయి. కూల్చివేసిన ఇళ్ల నిర్మాణ వ్యర్థాలను వేరే ప్రదేశానికి తరలించే పనిలో ఉన్నారు. నిర్మాణ వ్యర్థాలను తొలగించిన తరువాత రివర్‌బెడ్‌లో గుర్తించిన బార్డర్ వరకు గోడ నిర్మించనున్నారు. దానిపైన ఇనుప కంచెతో పెన్సింగ్ వేయనున్నారు. గోడ నిర్మాణం పెన్సింగ్‌కు అవసరమైన మెజర్‌మెంట్ పనులు జోరుగా సాగుతున్నాయి. మూసీనదిని ఆక్రమించి నిర్మించిన ఇళ్లు కూల్చివేసిన ప్రాంతంలో ప్రస్తుతం మూసీ ఎంతో విశాలంగా కనబడుతుంది. మరోవైపు మూసీనదిలో పేరుకుపోయిన చెత్తాచెదారం వ్యర్థాలను యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు.


మూసీలో వ్యర్థాలను యంత్రాలతో తొలగిస్తున్న దృశ్యం


మూసీ రివర్‌బెడ్‌లో కొలతలు వేస్తున్న టెక్నికల్ సిబ్బంది

బీజేపీ అభ్యర్థుల గెలుపుపై సంబరాలు

హయత్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ రెండు స్థానాలను కైవసం చేసుకోవడం పట్ల తుర్కయంజాల్ చౌరస్తాలో ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఒక్క సీటు కూడా గెలవలేకపోయాయని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయం అయ్యిందన్నారు. సీనియర్ నాయకులు బచ్చిగళ్ల రమేష్, శ్రావన్‌గౌడ్, సంజీవరెడ్డి. మైలారం బాబు, వెంకటేష్, నాగరాజు, విశాల్, కృష్ణ, సురేష్, శేఖర్‌రెడ్డి, మల్లెల రమేష్, నవీన్, మాలిక్ పాల్గొన్నారు.

గడ్డివాములకు మంటలు

హయత్‌నగర్ : పెద్దఅంబర్‌పేటలో గురువారం రాత్రి 8గంటలకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని గడ్డిమడులు కాలి బూడిద అయ్యాయి.. పెద్దఅంబర్‌పేట్ నుంచి పసుమాముల గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన గల గడ్డిమడిలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేయడంతో గడ్డి అంటుకొని పూర్తిగా ఖాళీ బూడిదైంది. సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు, హయత్‌నగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

అకస్మాత్తుగా చెలరేగిన మంటలు

● తప్పిన పెనుప్రమాదం

వనస్థలిపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో పెను ప్రమాదం తప్పిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్ ద్వారకామాయినగర్ కాలనీలోని ఖాళీ ప్రదేశంలో గురువారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. దీంతో సమీపంలోని గడ్డికి, చెట్లకొమ్మలకు మంటలు అంటుకుని మంటలు చెలరేగడంతో సమీప కాలనీవాసులు భయభ్రాంతులకు గురై ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పడానికి తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకవచ్చారు. ఖాళీ ప్రదేశం కావడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఖాళీ ప్రదేశంలో చెలరేగుతున్న మంటలు


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది


గుర్రంగూడ వార్డు కార్యాలయం ఎదుట నిరుపయోగంగా పడి ఉన్న చెత్త ఆటో

తుప్పు పడుతున్న చెత్త వాహనం..!

● పట్టించుకోని పారిశుధ్య విభాగం

సరూర్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నిత్యం కాలనీలు, బస్తీల్లో తిరుగుతూ చెత్తను సేకరించాల్సిన ఓ ఆటో మూలన పడింది. రెండు నెలలుగా టైర్లు పాడై, ఇతర భాగాలు చెడిపోయి గుర్రంగూడ వార్డు కార్యాలయం ఎదుట నిరుపయోగంగా నిలిపి ఉన్న సదరు వాహనంపై బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించడంలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా పారిశుధ్య విభాగం అధికారులు దీని గురించి పట్టించుకోవడం లేదని, దాంతో స్థానిక కాలనీల్లో చెత్త సేకరణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సదరు వాహనానికి రిపేర్ చేయించి చెత్త సేకరణకు వినియోగించుకోవాలని గుర్రంగూడకు చెందిన గడ్డం లింగారెడ్డి సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హయత్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని హయత్‌నగర్ పోలీసులు గురువారం కనుగొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డిపాలెం ఎదురుగా సూర్యవంశీ కాలనీలో ఓయో హోటల్ పక్కన గుర్తు తెలియని(40) సంవత్సరాల వ్యక్తి చనిపోయి పడి ఉన్నాడని స్థానికులు 100కు ఫోన్ చేశారు. దీంతో హయత్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి శవాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి ఒంటిపైన బ్లూ, వైట్ కలర్ పాయింటు, లైట్ పింకు రంగు షర్టు ఉందని పోలీసులు తెలిపారు. మృతుడు చూడడానికి బిక్షగాడుగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. పోలీసులు శవాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఇన్‌స్టాగ్రామ్ పంచాయతీ.. తల్లీ కూతుళ్లు అదృశ్యం

హయత్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేస్తున్న భార్యను మందలించాడు భర్త. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భార్యను చెల్లెలు ఇంటి వద్ద ఉంచడంతో ఇంట్లో చెప్పకుండా భార్య తన కూతురుతో కలిసి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లూర్ రావినారాయణరెడ్డి కాలనీలో నివాసం ఉండే గుమ్మడి స్వామికి 2010లో గుమ్మడి ఆశ(35)తో వివాహం జరిగింది. వీరికి వైష్ణవి, నిఖిత అను ఇద్దరు సంతానం. ఆశ కూలీగా పని చేస్తుంది. ఆశ బుధవారం రాత్రి 8గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తితో ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేస్తుంది. ఈ విషయాన్ని గమనించిన భర్త స్వామి ఎవరితో చాటింగ్ చేస్తున్నావని ప్రశ్నించడంతో ఆమె మౌనం వహించింది. దీంతో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. వెంటనే స్వామి అంజనాద్రినగర్ కాలనీలో నివాసం ఉండే తన చెల్లెలు రజిత వద్దకు ఆశ, కూతురు నిఖితను తీసుకుని పోయి అక్కడ ఉంచాడు. అనంతరం స్వామి తిరిగి రావినారాయణరెడ్డి కాలనీలోని తన ఇంటికి వచ్చాడు. ఇదిలా ఉండగా రాత్రి 9.30గంటలకు ఆశ తన కూతురును తీసుకుని రావినారాయణరెడ్డికాలనీ ఇంటికి వెళ్తున్నానని మరదలుకు చెప్పి ఇంటికి వెళ్లకుండా బయటకు వెళ్లింది. ఇదే విషయాన్ని రజిత అన్న స్వామికి ఫోన్‌చేసి చెప్పింది. దీంతో స్వామి ఆశ గురించి బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో గురువారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఆశ


నిఖిత

బస్సుదిగిన మహిళ..

వనస్థలిపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బస్సుదిగిన మహిళ అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా నర్సరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన నల్లబోతు చిలకమ్మ(60) గురువారం తెల్లవారుజామున నర్సరావుపేటలోని తన మనుమడైన పెండ్యాల ప్రదీప్‌కుమార్‌తో కలిసి బస్సుఎక్కి నగరంలోని అమీర్‌పేట్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో వనస్థలిపురం పనామా వద్ద తన మనుమడికి చెప్పకుండా బస్సు దిగింది. విషయం గమనించిన ప్రదీప్‌కుమార్ బస్సుదిగి ఎంతకివెతికినా ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో ప్రదీప్‌కుమార్ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.